క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11కేవీ సీజే కాలనీ ఫీడర్, పీవీ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు జరుగుతాయని ఏడీఈ యాదగిరి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జైన్ మందిర్, శివగారి ఎన్‌క్లేవ్, డీమార్ట్, ఎన్‌బీహెచ్ కాలనీ, సింహాద్రి నగర్, వినాయకనగర్, పీబీకాలనీ, సుధానగర్, ద్వారకామాయి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం షురూ..

అల్వాల్: ఫ్యూచర్ క్రికెట్ చాంప్స్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు కోచ్‌లు ఫయిక్, తాహెర్ శుక్రవారం తెలిపారు. కృపా కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న సెయింట్ థామస్ చర్చి మైదానం (బ్యాడ్మింటన్ గ్రౌండ్ పక్కన)లో ఈ శిబిరం కొనసాగుతోందని వారు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువకులు శిబిరంలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు ఫోన్: 92465 41044, 98858 08527.

రాపోలు శ్రీనివాస్‌కు 'దళిత రత్న'



రాపోలు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌కు చెందిన రాపోలు శ్రీనివాస్‌కు దళిత రత్న 2023 అవార్డును లభించింది. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పలు సేవా, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినందుకు రాపోలు శ్రీనివాస్‌కు అవార్డు అందజేశారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నాగారం బాబు మాదిగ రాపోలుకు అవార్డు వచ్చినందుకు అభినందించారు.

సిబ్బందికి సేఫ్టీ కిట్స్ పంపిణీ



కిట్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమలతారెడ్డి

బోడుప్పల్: 18వ డివిజన్‌లో మున్సిపల్ సిబ్బందికి శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి సేఫ్టీ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ కిట్స్ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



కాప్రా: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా రెడ్డి ఐక్యకార్యాచరణ కమిటీ ఆత్మీయ సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఏఎస్‌రావునగర్‌లో ఐకేసీ సభ్యులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 23న కీసరలోని కేబీఆర్ కన్వెన్షన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రెడ్డి బంధువులు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పైళ్ల హరినాథ్‌రెడ్డి, తుమ్మల మధుకర్‌రెడ్డి, బొజ్జా రాఘవరెడ్డి, పిసిరి మల్లారెడ్డి, పడమటి వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం.. తప్పిన ప్రమాదం



మల్లాపూర్: మల్లాపూర్ బీరప్పగడ్డ నుంచి మాణిక్‌చంద్ వెళ్లే రోడ్డులో ఓ డీసీఎం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి ఓ పక్కకు ఒరిగింది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులు స్పందించి విరిగిన స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రికార్డు స్థాయి వసూళ్లు

- నాలుగు రెట్లు అధికంగా ట్రేడ్ లైసెన్స్ పన్ను వసూళ్లు
- 90 శాతం వసూలు.. రూ.48.32 లక్షల ఆదాయం
- ఇంటి పన్ను వసూళ్లలో 5.5 శాతం పెరుగుదల
- పన్నులు చెల్లించి అభివృద్ధికి
- సహకరించాలంటున్న అధికారులు



నగర పాలక సంస్థ కార్యాలయం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పన్ను వసూలు రికార్డు స్థాయిలో వసూలైంది. గతంలో ఉన్న దానికంటే నాలుగు రెట్లు పెరిగింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.48.32 లక్షలు వసూలైంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మాత్రం ట్రేడ్ లైసెన్స్ ద్వారా రూ.10 లక్షలు వసూలు కాగా ఈ ఏడాది నాలుగు రెట్లు అధికంగా వసూలైంది. ఆస్తిపన్ను సైతం గతేడాదికంటే అధికంగా వసూలైంది. గతంలో 62 శాతం ఆస్తిపన్ను వసూలు కాగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి 67.5 శాతం ఆస్తిపన్ను వసూలైంది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత సంవత్సరం 5.5 శాతం పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. సకాలంలో ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర పాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని పాలకవర్గం, అధికారులు కోరుతున్నారు.

ట్రేడ్ లైసెన్స్ పన్ను వసూళ్లలో రికార్డు..

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 2,135 ట్రేడ్ లైసెన్స్ షాపులు ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.25 లక్షలు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారులు, సిబ్బంది మాత్రం రికార్డు స్థాయిలో 1,820 షాపుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూ.48.32 లక్షలు వసూలు చేశారు. మొత్తం 90 శాతం ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేసినట్లు వెల్లడించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మాత్రం ట్రేడ్ లైసెన్స్ ద్వారా రూ.10 లక్షలు వసూలైంది. గతంతో పోలిస్తే నాలుగు రెట్లు ట్రేడ్ లైసెన్స్ రూపంలో ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.

ఆస్తిపన్ను మొత్తం డిమాండ్ రూ.23.50 కోట్లు

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను రూపంలో మొత్తం డిమాండ్ రూ.23.50 కోట్లు ఉంది. మొత్తం అసెస్‌మెంట్ చేసిన ఇళ్లు 32,293 ఇళ్లు ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు రూ.15.86 కోట్లు అనగా 67.5 శాతం ఆస్తిపన్ను వసూలు చేశారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 62 శాతం వసూలైంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 5.5 శాతం అధికంగా వసూలు చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగర ప్రజలకు ఆస్తిపన్నులో 5 శాతం రాయితీ కల్పించింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికి తమ ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని బోడుప్పల్ నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటూ అధికారులు కరపత్రాలు, మైకుల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటి యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు సకాలంలో చెల్లించి ప్రజలు నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకుని పన్నులో 5 శాతం రాయితీ పొందాలని కోరాం. పాలకవర్గం, అధికారుల సహకారంతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో అవసరమున్న చోట మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అందుకు ప్రజలు కూడా సహకరించాలి.

– వాణిరెడ్డి, కమిషనర్ బోడుప్పల్

శని, ఆదివారాల్లోనూ చెల్లింపులకు అవకాశం



ఎన్.శంకర్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్

కాప్రా: ఆస్తి పన్ను చెల్లింపుదారుల కోసం 5 శాతం రాయితీతో జీహెచ్ఎంసీ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ స్కీం ద్వారా ట్యాక్స్ రిబెట్ కల్పిస్తూ ఆస్తిపన్ను చెల్లింపునకు ఏప్రిల్ 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఆస్తిపన్ను చెల్లింపు దారులకు కాప్రా సర్కిల్ కార్యాలయంలో సెలవు దినాలైన శని, ఆదివారాల్లో కూడా సర్వీస్ సెంటర్ తెరిచే ఉంటుందని డిప్యూటీ కమిషనర్ ఎన్.శంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఆర్థిక ఏడాది 2021–22లో కాప్రా సర్కిల్ పరిధిలో ఎర్లీబర్డ్ స్కీం ద్వారా రూ.24 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు జరిగాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా సర్కిల్ పరిధిలోని నగరవాసులు ఎర్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకుని 5శాతం రిబేట్‌తో ఆస్తుపన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ ఆస్తిపన్ను చెల్లింపులు ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాలు, ఏరియా బిల్‌కలెక్టర్ వద్ద చెల్లించవచ్చని తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హబ్సిగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ బీవీ చారి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హబ్సిగూడలో డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన ఎనిమిది సంవత్సరాల్లో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి కాలనీ, ప్రతి ఇంట్లో కనిపిస్తున్నాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయాన్ని సాధించి మరోసారి సీఎం కేసీఆర్ నాయకత్వంలో అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బేతి స్వప్నరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బద్దం భాస్కర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, వనంపల్లి గోపాల్‌రెడ్డి, పార్టీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ బీవీ.చారి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

అభివృద్ధి సంక్షేమ పనులే ఏజెండా

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే ఎజెండా చేసుకుని ముందుకు వెళ్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. రామంతాపూర్ డివిజన్ పరిధిలోని సాయి కృష్ణానగర్‌లో రూ.15 లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను శుక్రవారం ఆయన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ జలమండలి అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్స్, షాదీ ముబారక్ కల్యాణలక్ష్మి ఆసరా పెన్షన్లు అందజేశామన్నారు. జలమండలి జీఎం సంతోష్ కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ రవీందర్‌గౌడ్, టీఆర్ఎస్ బీజేపీ నేతలు గడ్డం రవికుమార్, దళిత సుధాకర్, నరసింహారెడ్డి, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్ కోసం భూములు ఇస్తున్నాం



మాట్లాడుతున్న చిన్నింగల్ల కుమార్

బోడుప్పల్: మా పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పెద్ద కంచె భూములను ల్యాండ్ పూలింగ్ కింద ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు బోడుప్పల్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చిన్నింగల్ల కుమార్, కార్పొరేటర్ చీరాల నర్సింహ అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ భవనంలో శుక్రవారం వారు మాట్లాడుతూ కొంత మంది దళిత నేతలు మా భూములను ప్రభుత్వం బలవంతంగా బెదిరించి గుంజుకుంటున్నారని ఆరోపణలు చేస్తున్నారని, వాటిలో వాస్తవం లేదన్నారు. మొత్తం 61 కుటుంబాలు ఉండగా వారిలో 46 కుటుంబాలు తమ భూములను ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా మా భూములు ఇచ్చేందుకు ప్రయత్నం చేశాం. కానీ ఫలితం లేకపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి మల్లారెడ్డి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి మా భూములకు న్యాయం చేస్తున్నారన్నారు. 40 సంవత్సరాల నుంచి మాకు భూములు ఉన్నా ఏ పంటలు పండించలేకపోతున్నామని, మా కుటుంబాలు కటిక పేదరికాన్ని అనుభవిస్తూ చాలామంది మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందిగా పని చేస్తున్నారన్నారు. మిగిలిన దళిత రైతులు కూడా మాతో కలిసి వస్తారని ఆశిస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, అంబేడ్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య, సలహాదారులు రాపోలు శంకరయ్య, కామగల్ల నర్సింహ, రాపోలు నారాయణ, ఉపాధ్యక్షుడు చంటి శ్రీను, ప్రతినిధులు రాపోలు రామస్వామి, మైసగల్ల మల్లేష్, కుమార్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు..



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

రామంతాపూర్: రామంతాపూర్ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో శుక్రవారం వెంకటరెడ్డినగర్‌లోని శ్రీసత్య సాయి హైస్కూల్ 20వ వార్షికోత్సవ వేడుకలు ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చేతన శ్రీవాణి, ఎస్సై సుధాకర్‌రెడ్డి, స్కూల్ చైర్మన్ గడ్డం సాయికిరణ్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను చాటిచెబుదాం..



చర్లపల్లిలో ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కాప్రా: దేశ సంస్కృతిలో మతాలు, పండగలు, ఆచారాలు మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెబుతాయని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా చర్లపల్లి భరత్‌నగర్‌లోని మస్జిద్–ఈ–అబు–బాఖర్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని, పండగలను అన్ని వర్గాలు ఐక్యతతో నిర్వహించుకోవాలని సూచించారు. ముస్లిం నేతలు నయీం, కలీం, అలీమ్, హుస్సేన్, అబిద్ హుస్సేన్, వసీమ్ మునిబ్ యాషిద్, రషీద్ అన్వర్, డివిజన్ నాయకులు బాల్‌రెడ్డి, విద్యాసాగర్, శ్రీకాంత్ యాదవ్, ధనుంజయ్‌గౌడ్, సురేష్, భానుచందర్, కోటిరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

ఉప్పల్‌లో ఇఫ్తార్ విందు

ఉప్పల్: ఉప్పల్ మెట్రో కుతుబ్‌షాహీ మసీదులో మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు ఉంటారని పవిత్ర మాసంగా భావిస్తామన్నారు. కార్యక్రమంలో ఖలీల్, టీపీసీసీ సభ్యులు, వినోద్, అబ్దుల్ సమ్మద్, సందీప్, చందు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో ఇంటింటికీ బీజేపీ



మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ విడుదలైన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ హాజరై కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్, నాయకులు మంగేష్, ఆనంద్, గోపాలకృష్ణ, మణిరత్నం, సర్వేష్‌యాదవ్, సంతోష్, రాము ముదిరాజ్, బజరంగ్, అంజలియాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా రెక్కీతో దోపిడీ



వివరాలు వెల్లడిస్తున్న మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి

మేడిపల్లి: పక్కాప్లాన్‌తో దోపిడీ చేసిన ముగ్గురు నిందితులను మేడిపల్లి పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. బోడుప్పల్, చిలుకానగర్‌లలో నివాసముండే ముగ్గురు స్నేహితులు ఉడుగు స్వామి(29) హెచ్‌పీ గ్యాస్ డెలివరీ బాయ్, బోడుప్పల్ నివాసి మత్స్యగిరి(26) ప్రైవేటు ఉద్యోగి, సాయినిఖిల్(24) కటింగ్ షాప్‌లో వర్కర్. వీరు ముగ్గురు స్నేహితులు కలిసి మద్యం తాగేవారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు పథకం పన్నారు. హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌లో మేనేజర్‌గా పనిచేసే జ్ఞానేశ్వర్‌రెడ్డి బోడుప్పల్‌లో నివాసం ఉంటాడు. అతడు డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్లే సమయంలో దోపిడీ చేయాలని ముగ్గురూ కలిసి ప్లాన్ చేశారు. బుధవారం రాత్రి దాదాపు 10 గంటల సమయంలో జ్ఞానేశ్వర్‌రెడ్డి ఆఫీస్ మూసివేసి డబ్బులు తీసుకుని బయలుదేరగా కేంబ్రిడ్జి స్కూల్ వద్ద అతడి బైకును ఆపి, కళ్లలో కారంపొడి చల్లారు. అతడు డబ్బుల సంచీని గట్టిగా పట్టుకోవడంతో చిరిగిపోయి డబ్బులు కిందపడిపోయాయి. దొరికిన డబ్బులు తీసుకొని పారిపోయి ముగ్గురు సమానంగా పంచుకున్నారు. పోలీసులు శుక్రవారం నిందితులను అదుపులోకి తీసుకొని నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి తెలిపారు.

గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



వెంకటాపురంలోని సెయింట్ ఆంథోని చర్చిలో..

గుడ్ ఫ్రైడే సందర్భంగా అన్ని చర్చిల్లో క్రిస్టియన్లు శుక్రవారం పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని చర్చిల్లో పాస్టర్లు ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చెంగిచర్ల గ్రామంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. వివరాలు.. చెంగిచెర్ల గ్రామంలో 10 ఏళ్ల నుంచి లక్ష్మి(50) నివాసం ఉంటూ వైన్స్ షాపుల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. మద్యానికి బానిసైంది. గురువారం హనుమాన్ నగర్ రోడ్డు పక్కన చనిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపర్చారు. వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సందీప్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుషాయిగూడ: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం శుక్రవారం కుషాయిగూడ పీఎస్ పరిధిలో లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. చర్లపల్లి పరిధిలోని ఐటీసీఎల్ ఎక్స్‌రోడ్ సమీపంలో ఓ వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వృద్ధుడు సమీప ప్రాంతంలో యాచకుడని, అదే ప్రాంతంలో పడుకోవడం, తినడం చేస్తుండేవాడని, అనారోగ్య కారణాలతోనే వృద్ధుడు మృతి చెంది ఉంటాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అల్వాల్: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని కానాజీగూడ డైరీఫామ్ వద్ద ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో సదరు వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కానాజీగూడ అంబేడ్కర్‌నగర్‌లో నివాసముండే ప్రాన్సిస్(25)గా మృతి చెందిన వ్యక్తిని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనంతోపాటుగా డ్రైవర్ పరారయ్యాడు. స్థానిక సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే..

కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో పాదయాత్ర చేసిన నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేయడంలో రెండూ ఒక్కటేనని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం ఓల్డ్ నేరేడ్‌మెట్ రామమందిరం నుంచి పాదయాత్ర నిర్వహించారు. నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఉన్న రెండు ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తున్నాయని అన్నారు. పైకి వ్యతిరేక పార్టీలుగా ఉన్నప్పటికీ అంతర్గతంగా ఒక్కటేనన్నారు. టెన్త్ పరీక్షా పేపర్ల లీకేజీలో రెండు పార్టీలు నాటకాలు ఆడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. పాదయాత్రలో శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ యాదవ్, సానాది శంకర్, గుత్తి రాంచందర్, జీవన్‌రెడ్డి, రాములు, ఉమేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనను కోరుతున్న ప్రజలు



సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

కాప్రా: దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి చేరువలో ఉందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం బి–బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్ పాలననే కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును క్షేత్రస్థాయిలో మరోసారి పార్టీ శ్రేణులు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎడ్డగట్టే విధంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలన్నారు.